క్లుప్తంగా

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

టెక్కలి: మాదక ద్రవ్యాల దుర్వినియోగం అనే అంశంపై శనివారం స్థానిక గోపినాథపురంలోని ఎస్‌వీఆర్‌కే జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు కోర్టు వర్గాలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపాయి. జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్ఆర్ తేజ చక్రవర్తి మల్ల ఆధ్వర్యంలో ఉదయం పది గంటలకు సదస్సు ప్రారంభమవుతుందన్నారు.

టెక్కలి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నళినాక్షి

టెక్కలి: టెక్కలి ఇన్‌చార్జి తహసీల్దారుగా డీటీ నళినాక్షి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల విధుల్లో భాగంగా విజయనగరం జిల్లా నుంచి తహసీల్దారు బాలమురళీ టెక్కలి తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. తాజాగా సొంత జిల్లాలకు తహసీల్దార్లను బదిలీపై ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల మేరకు విధుల నుంచి రిలీవ్ అయ్యారు. దీంతో అదే కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దారు నళినాక్షి ఇన్‌చార్జి బాధ్యలను అధికారులు అప్పగించారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి


రోగికి మందులు అందజేస్తున్న ఎస్‌ఐ హైమావతి

సోంపేట: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సోంపేట ఎస్‌ఐ బి.హైమావతి అన్నారు. పట్టణంలోని తెలగవీధిలో జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహిచారు. 200 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. స్థానికులు ఐ.లక్ష్మీనారాయణ, చిత్రాడ శేఖర్, మణికంఠ, ప్రదీప్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన తహసీల్దార్‌కు సత్కారం

నందిగాం: ఎన్నికల ముందు జరిగిన బదిలీల్లో భాగంగా వచ్చి కొద్ది రోజులు విధులు నిర్వహించినప్పటికీ తహసీల్దార్‌గా తనదైన మార్కు చూపించారని పలువురు కొనియాడారు. విజయనగరం జిల్లాకు బదిలీ అయిన స్థానిక తహసీలార్ వి.పద్మావతిని రెవెన్యూ సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు.

మెడికల్ టెక్నీషియన్లకు శిక్షణ


శిక్షణకు హాజరైన ఈఎంటీలు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఆవరణలో 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు శిక్షణ తరగతులు శుక్రవారం నిర్వహించారు. ఈఎంటీలకు యునైటెడ్ కింగ్డమ్ మాడ్యూల్ అనుగుణంగా శిక్షణ అందించారు. జిల్లా ఏఈ ఎంఎస్ మేనేజర్ హరిప్రసాద్, ఓఈ జగన్నాథరావు పర్యవేక్షణలో ఆన్‌జాబ్ ట్రైనర్ నెయ్యిల కృష్ణ విధినిర్వహణలో తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇచ్చారు. టెక్కలి, పలాస, శ్రీకాకుళం డివిజన్లలో పనిచేస్తున్న 30 మంది ఈఎంటీలు పాల్గొన్నారు.

కులవృత్తులపై విద్యార్థులకు అవగాహన


కమ్మరి కులవృత్తిని విద్యార్థులకు పరిచయం చేస్తున్న హెచ్ఎం నరేంద్రనాథ్ పట్నాయక్

ఇచ్ఛాపురం రూరల్: జీవనాభివృద్ధికి కులవృత్తులు కూడుపెడతాయని కొళిగాం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేంద్రనాథ్ పట్నాయక్ అన్నారు. శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాఠశాల విద్యార్థులకు కమ్మరి, కుమ్మరి కుల వృత్తులను పరిచయం చేశారు. ప్రతి ఒక్కరూ జీవన నైపుణ్యాలను అలవర్చుకోవాలని అన్నారు.

వీరుడికి సత్కారం



జయకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

కవిటి: ఇక్కడ సత్కారం పొందిన వ్యక్తి పేరు బుద్ధాల జయకృష్ణ. ఆయన కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న వీర జవాను. అప్పటి యుద్ధంలో తీవ్రంగా గాయపడి 20 రోజులు కోమాలోకి వెళ్లి ప్రాణాలతో బయటపడ్డారు. విజయ్ దివస్ సందర్భంగా కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయనను శుక్రవారం హెచ్ఎం బెందాళం మల్లేశ్వరరావు తదితరులు సత్కరించారు.

పశువైద్య శిబిరం

కోటబొమ్మాళి: చౌదరికొత్తూరు గ్రామంలో శుక్రవారం పశువైద్యశిబిరాన్ని నిర్వహించారు. కోటబొమ్మాళి వెటర్నరీ ఏడీ మంద లోకనాథం, కురుడు పశువైద్యాధికారి ఎల్.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో 112 తెల్లజాతి పశువులకు ముద్ద చర్మవ్యాధి నివారణా టీకాలు, 18 దూడలకు నట్టల నివారణా టీకాలు వేశారు.

కొండెక్కిన కూరగాయల ధరలు!



● వర్షాలతో పాడైన పంటలు ● పెరిగిన ధరలతో ప్రజలు అవస్థలు


వర్షాలకు పాడైపోయిన దొండ పందిరి

సోంపేట:

కూరగాయల ధరలు ప్రజలను వణికిస్తున్నాయి. కొండెక్కి కూర్చున్న ధరలతో కొనేందుకు జనం భయపడుతున్నారు. ధరలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా ఉన్నాయి. వర్షాలతో స్థానికంగా సాగు చేస్తున్న కూరగాయల పంటలు పాడవ్వడంతో కొంతవరకూ సరుకులు అందుబాటులో లేకుండా పోయింది. దీనికి తోడు ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని పలు మార్కెట్లకు కూరగాయలను సరఫరా చేసే బెంగళూరు, కటక్ ప్రాంతాల్లో వర్షాలు కురువడంతో దిగుమతులు లేక ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో సాగు చేసే దొండ, బెండ, ఆనప, వంగ, కాకర పంటలు కూడా అధిక వర్షాల కారణంగా దిగుబడులు తగ్గాయని రైతులతోపాటు వ్యాపారులు తెలియజేశారు. నెల రోజుల క్రితం వరకు కూరగాయల ధరలు సామాన్యుడికి అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం వర్షాలు కురవడంతో కూరగాయల పంటలు పాడవ్వడం, ఇతర ప్రాంతాల నుంచి ఆశించిన స్థాయిలో దిగుమతి లేక పోవడంతో ధరలు పెరుగుదలకు కారణంగా చెబుతున్నారు.

ఏదైనా రూ. 50 పైమాటే..

15 రోజుల క్రితం వరకూ కిలో 10 నుంచి 15 రూపాయలకు దొరికే బెండకాయలు, దొండ, చిక్కుడు కాయ లు ప్రస్తుతం 50 రూపాయలు పైనే పలుకున్నా యి. అలాగే క్యాబేజీ, వంకా య, క్యారెట్, బీట్‌రూట్, బీర, కాకరకాయలు సైతం 50


సోంపేట మార్కెట్లో కూరగాయలు

నుంచి 60 రూపాయలు పైనే పలుకుతున్నాయి. ఒక మునగ కాయ పది రూపాయలు పలుకుతుంది. కాలీ ఫ్లవర్ 70 రూపాయలకు చేరువలో ఉంది. టమోట ధర కూడా కిలో 60 రూపాయలు పలుకుతోంది. దీంతో సామన్యుడి ఖర్చులు తడిపి మోపిడవుతున్నాయి. కూరగాయలు కొనుగోలు చేయడానికి వెనుకంజ వేస్తున్నారు.

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఇలా..

ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం మండలాల్లోని పలుగ్రామాల్లో సుమారు 200 ఎకరాల వరకు ఈ సీజన్లో రైతులు కూరగాయలు పండిస్తుంటారు. ఎక్కువగా బెండ, కాకర, ఆనప, దొండ, వంకాయ, చిక్కుడు పంటలు సాగు చేసి జీవనాధారం పొందుతున్నారు. ఈ ప్రాంతంలో కూరగాయలు సాగు చేస్తుండడంతో సామాన్యుడికి కూడా ధరలు అందుబాటులో ఉండేవి. పండించిన పంటలకు కొద్దిరోజుల క్రితం వరకు ధర గిట్టుబాటు కాలేదని రైతులు తెలియజేశారు. ప్రస్తుతం వర్షాలు కారణంగా పంట పోవడంతో ధరలు పెరిగినా రైతులకు ప్రయోజనం లేకుండా పోయింది. వర్షాలకు పంటల దిగుబడులు పూర్తిగా తగ్గిపోయావని చెబుతున్నారు.

దిగుమతి లేక పెరిగిన ధర



వర్షాలు పడడంతో ఇంతర ప్రాంతాల నుంచి ఆశించిన స్థాయిలో కూరగాయలు దిగుమతి లేదు. ప్రస్తుతం సోంపేట, కంచిలి మండలాల రైతుల వద్ద కూడా కూరగాయలు లభించడం లేదు. దీంతో వీటి ధరలు పెరిగాయి. దిగుమతులు పెరిగితే ధరలు తగ్గే అవకాశం ఉంది.

–పొందర మధు, వ్యాపారి, సోంపేట

సామాన్యుడికి ఇబ్బందులు



ప్రస్తుతం కాయగూరల ధరలు బాగా పెరిగాయి.దీంతో తనలాంటి సామాన్యుడు ఇబ్బందులు పడుతున్నాడు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో నిత్యం పనికూడా దొరికే అవకాశం ఉండదు. దీంతో కూరగాయలు కొనుగోలు చేసేందుకు సైతం డబ్బుల్లేక ఇబ్బంది పడుతున్నాం.

–తట్ట షణ్ముఖరావు, కొనుగోలుదారుడు, సోంపేట


వర్షాలకు పూత రాలిన వంగ తోట

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి


సభ్యత్వాన్ని నమోదు చేస్తున్న ఉపాధ్యాయ నేతలు

పలాస: ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలిని బహుజన ఉపాధ్యాయ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు పలాస మండలంలోని బొడ్డపాడు, రంగోయి, బ్రాహ్మణతర్లా, రెంటికోట, పలాస, కాశీబుగ్గ లో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం పరిశీలించారు. ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంఘ ప్రతినిధి చిట్టేటి రమేష్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. బహుజన ఉపాధ్యాయుల కోసం నిరంతరం సంఘం పనిచేస్తుందని చెప్పారు. 117 జీఓను వెంటనే రద్దు చేయాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బంగారు తాతారావు, జిల్లా కోశాధికారి బోకర దుర్యోధనరావు, నందిగాం మండల అధ్యక్షుడు రట్టి లక్ష్మీనారాయణ ఉన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో చోరీ

టెక్కలి: టెక్కలి పాత జాతీయ రహదారిలో పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో గల శ్రీ వేంకటేశ్వర ఆలయంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. శుక్రవారం ఉదయం అర్చకులు ఆలయం తెరిచే సమయంలో చోరీకి గురైనట్లు గుర్తించారు. ఆలయానికి ముందున్న గ్రిల్స్ తాళాలు బద్దలు కొట్టి గర్భగుడి తలుపులు తెరిచి కొంత నగదు, పూజా సామగ్రి ఎత్తుకెళ్లినట్లు అర్చకులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆలయానికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు. టెక్కలిలో ఇటీవల ఎక్కువగా దొంగతనాలు జరగడం ఆందోళన కలిగిస్తోంది.

విధిగా హెల్మెట్ వాడాలి


మాట్లాడుతున్న జడ్జి మాధురి

కాశీబుగ్గ: వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి అన్నారు. పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కాలేజీ విద్యార్థులకు హెల్మెట్ వినియోగంపై శుక్రవారం అవగాహన కల్పించి మాట్లాడారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే జరిమానా విధిస్తారన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షులు సయ్యద్ అహ్మద్, జాయింట్ సెక్రటరీ జి.ఎం.ఎస్.అనిల్ రాజు, కోత రజనికుమార్, ప్రభాకర్, రవికుమార్, శ్యామ్, చిట్టిబాబు, ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ సంతోష్‌కుమార్ ఉన్నారు.

కళింగ సంక్షేమ సంఘ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా దిక్కల


మన్మథరావు

కంచిలి: కళింగ సంక్షేమ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా కంచిలి గురుకుల పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయుడు దిక్కల మన్మథరావు ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని శుక్రవారం విలేకరులకు తెలిపారు. తనకు అప్పగించిన ఈ పదవితో కళింగ సామాజిక వర్గం అభివృద్ధికి కృషిచేస్తానన్నారు.

అదనపు భవనం ప్రారంభం


తరగతి గదిని ప్రారంభిస్తున్న పుండరీక్షుడు

కాశీబుగ్గ: మందస మండలం సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో హైదరాబాద్‌కు చెందిన సంకల్ప ట్రస్ట్ వారిచే ఏడు లక్షల రూపాయలతో అదనపు భవనాన్ని నిర్మించారు. దీన్ని విశాఖ విశ్రాంత జడ్జి ఆర్.పుండరీక్షుడు శుక్రవారం ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుందర సాల్మన్ మాట్లాడుతూ.. పిల్లలకు మంచి వసతి కల్పించిన సంకల్ప ట్రస్ట్ వారికి రుణపడి ఉంటామని అన్నారు. కార్యక్రమంలో సంకల్ప ట్రస్ట్ ప్రతినిధులు ఆర్.జగన్ మోహన్‌రావు, పి.నేతాజీ, సీహెచ్ విశ్వప్రసాద్, డి.వెంకటరమణ, సీహెచ్ కృష్ణప్రసాద్, ఇ.నారాయణమూర్తి, కె.రమేష్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

ఉత్సాహంగా శిక్షాసప్తాహ్


ఇంకుడు గుంతల ఆవశ్యకతను వివరిస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో శిక్షాసప్తాహ్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు ఇందులో భాగంగా పంజావీధి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వర్షపునీటి వినియోగం, ఇంకుగుంతల ఆవశ్యకత, పెరటి పంటల గురించి శుక్రవారం అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్ఎం ధనలక్ష్మి ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలన

ఇచ్ఛాపురం రూరల్: సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అన్ని పంచాయతీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు ఎంపీడీవో వై.వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండపల్లి, ఈదుపురం గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను శుక్రవారం పర్యవేక్షించారు. పిట్ట మామయ్యరెడ్డి, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కూన విష్ణు మూర్తి, పంచాయతీ కార్యదర్శి నాలావు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నైపుణ్యత కలిగిన క్రీడాకారులను గుర్తించాలి


మాట్లాడుతున్న డిప్యూటీ ఈవో విలియమ్స్

టెక్కలి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో వివిధ రకాల క్రీడలపై మక్కువ కలిగిన వారిని గుర్తించి వారిని మరింత నైపుణ్యత కలిగిన క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని ఉప విద్యా శాఖాధికారి విలియమ్స్ అన్నారు. టెక్కలి మండలం పాత నౌపడ సమీపంలో గల ప్రణవి కళాశాలలో శుక్రవారం డివిజన్ స్థాయిలో వ్యాయామ విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రీడలపై మక్కువ పెంచే విధంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లో క్రీడలను మరింత అభివృద్ధి చేయాలని విలియమ్స్ కోరారు. కార్యక్రమంలో వ్యాయామ విద్య అధ్యక్షుడు ఎం.వి.రమణ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బి.వి.రమణ, ఎంఈవో డి.చిన్నారావు, క్రీడా నిర్వాహకులు, వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్ ఫణికుమార్, మాధవరావు, కె.రాజారావు, పి.తవిటయ్య, కె.ప్రకాశ్, జి.శ్రీనివాసరావు, హరిబాబు, బాడాన నారాయణరావు, రాజా ఉన్నారు.

బుడగ జంగాల సమస్యపై మంత్రికి వినతి


బుడగ జంగాల సమస్యను మంత్రికి వివరిస్తున్న నాయకులు

కంచిలి: ఇచ్ఛాపురం నియోజవర్గంలో నివసిస్తున్న బుడగ జంగాల కుల ధ్రువీకరణ సమస్యపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడుకు స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్‌తో కలిసి కంచిలి మండల టీడీపీ నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు సచివాలయంలో మంత్రి చాంబర్‌లో శుక్రవారం కలిసి సమస్యను వివరించారు. నియోజకవర్గంలో వెయ్యి కుటుంబాలు నివసిస్తున్నారని, వీరికి చాలా కాలంగా కులధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం లేదని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వీరు కంచిలి మండలంలో జాడుపూడి కాలనీ, జక్కర, సోంపేట మండలం కొర్లాంలో, కవిటి మండలంలో ఆర్.బెలగాం, నీలాపుపుట్టుగ, కొత్తకొజ్జిరియా, నెలవంక తదితర ప్రాంతాల్లో నివసిస్తున్నారని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో పిలక చిన్నబాబు, మాదిన రామారావు, మర్రిపాటి పూర్ణ ఉన్నారు.

పాఠశాలల సందర్శన


పాఠశాల సందర్శనలో సుభాష్‌బాబు తదితరులు

కాశీబుగ్గ: సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అన్ని యాజమాన్యాల పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బల్ల సుభాష్ బాబు అన్నారు. ఏపీటీఎఫ్ మందస మండల శాఖ ఆధ్వర్యంలో ఉద్దానం ప్రాంతంలోని హరిపురం, అంబుగాం, నారాయణపురం, బహడపల్లి, బేతాళపురం, లోహరిబంద పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యల్ని సేకరించారు. ప్రభుత్వం 117 జీఓ రద్దుకు చర్యలు వేగంవంతం చేయాలని, పెండింగులో ఉన్న పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని, అంతవరకు మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గవ్వ భీమారావు, మందస మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.కిరణ్‌కుమార్, కె.సుందరరావు, కార్యవర్గ సభ్యులు ఎస్.ఢిల్లీశ్వరరావు, డి.చంద్రశేఖర్, కె.ధనరాజు, ఎస్ ప్రసాదరావు, వైకుంఠ బెహరా ఉన్నారు.

సమగ్రశిక్షా పీఈటీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి


విలియమ్స్, ఎన్‌వీ రమణలకు వినతిపత్రం అందిస్తున్న జిల్లా ఎస్ఎస్ఏ పీఈటీ ప్రతినిధులు

కవిటి: సమగ్ర శిక్షా పరిధిలో పనిచేస్తున్న హెల్త్ అండ్ వ్యాయామ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎస్ఎస్ఏ వ్యాయామ ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు టెక్కలి డివిజన్ డిప్యూటీ ఈవో పి.విలియమ్స్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు ఎంవీ రమణకు నౌపడలో శుక్రవారం జరిగిన సమావేశంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 12 సంవత్సరాల నుంచి హెల్త్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులుగా పని చేస్తూ పార్ట్ టైం అనే పదంతో ఒక్కపూట పని జీవో ఉన్నప్పటికీ ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలోనే ఉంటూ హెచ్ఎం చెప్పే ప్రతి పని చేస్తూ ఉన్నామన్నారు. మినిమంటైంస్కేల్ అయినా వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై ఎన్‌వీ రమణ మాట్లాడుతూ.. సమగ్రశిక్షా రాష్ట్ర ఎస్‌పీడీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తానన్నారు.

తహసీల్దార్‌కు ఘనంగా వీడ్కోలు

వజ్రపుకొత్తూరు: మండలంలో తహసీల్దార్‌గా పని చేసి బదిలీపై సొంత జిల్లా విశాఖపట్నానికి వెళ్లిన ఎం.సురేష్‌కు రెవెన్యూ ఉద్యోగులు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా స్థానిక ఉప తహసీల్దార్ వాయిలపల్లి గిరిరాజ్ అధ్యక్షతన మండలంలోని వీఆర్‌ఓలు, రేషన్ డిపో డీలర్‌లు కలిసి ఆయన్ని దుశ్శాలువతో సత్కరించి గౌరవించారు. ఎంఆర్ఐ డి.పవిత్ర, సర్వేయర్ కె.తిరుపతిరావు, వీఆర్‌ఓలు వెంకటరావు, ఇందిరాప్రియదర్శిని, డీలర్‌లు తవిటయ్య, కామేశ్వరరావు ఉన్నారు.

పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం

కవిటి: ప్రతీ ఇంటిలో వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణం ద్వారా మాత్రమే గ్రామాల్లో పారిశుద్ధ్యం సాధ్యమని ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా సహలాలపుట్టుగ గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు ఎంతమందికి ఉన్నాయో సర్వే చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నీటి వనరుల వద్ద క్లోరినేషన్ చేయాలని సూచించారు. సచివాలయ కార్యదర్శి ఎం.హరికృష్ణ ఉన్నారు.

శ్రామిక్ కాంగ్రెస్‌లో సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న రైల్వే ఉద్యోగులు

కాశీబుగ్గ: ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఉద్యోగులకు చెందిన అర్బన్ బ్యాంకు డెలిగేట్ ఎన్నికలు ఇటీవల జరిగాయి. వీటి ఫలితాలు శుక్రవారం వెలువడ్డాయి. ఈ సందర్భంగా 38, 40, 83 కానిస్టేన్సీలకు సంబంధించి ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు అభ్యర్థులు విజయం సాధించారు. దీంతో పలాస బ్రాంచ్ కార్యాలయంలో సందడి కనిపించింది. పలాస బ్రాంచ్ నాయకులు కేక్ కట్‌చేసి పంచిపెట్టి వారంతా సరదాగా సంబరాలు జరుపుకున్నారు. నాయకులు రవిచౌదిరి, రాజశేఖర్‌తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తుఫాన్ రక్షిత భవనాలు పరిశీలన


తుఫాన్ భవనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ భరత్‌నాయక్ తదితరులు

కాశీబుగ్గ: మందస మండలం పరిధిలో ఉన్న తుఫాన్ రక్షిత భవనాలను పలాస ఆర్డీవో భరత్ నాయక్ శుక్రవారం పరిశీలించారు. సముద్ర తీర ప్రాంతాలైన బేతాళపురం, రట్టి, గంగువాడ, లక్ష్మీపురం, ఎర్రముక్కం, దున్నపూరు, గెడ్డఊరు, లక్ష్మీపురం, సిగలపుట్టుగ, బిడిమి తదితర గ్రామాలలోని రక్షిత భవనాలను పరిశీలించారు. తీర ప్రాంతాలలో రక్షిత భవనాలను పరిశీలించి వాటి స్థితిగతులను అధికారులకు నివేదించనున్నట్లు ఆర్డీవో తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ తిరుమలబాబు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సైనికుడిగా పనిచేస్తే జీవితాంతం క్రమశిక్షణ

కాశీబుగ్గ: సైనికుడుగా పనిచేస్తే జీవితాంతం క్రమశిక్షణ ఉంటుందని కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడు అన్నారు. కార్గిల్ దివస్ సందర్భంగా శుక్రవారం కాశీబుగ్గ బస్టాండ్ వద్ద మాజీ సైనికులు, పవనపుత్ర సేవా సంస్థ సంయుక్తంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జంటపట్టణాలకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ మల్లేశ్వరరావు, డాక్టర్ మోహన్ బాబు శిబిరంలో సేవలు అందించారు. గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, మొక్కల ప్రేమికుడు కొత్తపల్లి చిన్నాచారి మాట్లాడుతూ.. మాజీ సైనికులు మొక్కలు నాటుతామంటే తాము సమకూర్చుతామన్నారు. 20 మంది మాజీ సైనికులు, స్థానిక యువకులు ఏడుగురు రక్తదానం చేశారు. ముందుగా దేశం కోసం ప్రాణాలర్పించిన అమర జవాన్లకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు ఇళ్ల మన్మథరావు, వైస్ ప్రెసిడెంట్ బంగారి బారికి, కొల్లి ఫాల్గుణరావు, వైకుంఠరావు, బాబూరావు, సూరినారాయణ, తాతారావు, పవనపుత్ర సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.


కాశీబుగ్గ: రక్తదానం శిబిరంలో ఎస్సై, వైద్యులు


ఇచ్ఛాపురం: అమరువీరులకు నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

కవిటి: కార్గిల్ పోరులో ప్రాణాలు అర్పించిన అమర సైనికులకు చిన్నారులు ఘనంగా నివాళులర్పించారు. పెద్ద ఎర్రగోవిందపుట్టుగ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో అమరులైన పలువురు వీరుల్ని స్మరిస్తూ కొవ్వొత్తులు వెలగించి.. రెండు నిమిషాలు మౌనం పాటించారు.హెచ్ఎం దేవదాస్ కార్గిల్ పోరులో మనం సాధించిన విజయాన్ని పిల్లలకు వివరించారు.

ఇచ్ఛాపురం: పట్టణంలోని యూకాంప్లెక్సు ఆవరణ, మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయం, జ్ఞానభారతి పాఠశాలల ఆవరణలో కార్గిల్ దివస్‌ను జరుపుకున్నారు. మాజీ సైనిక ఉద్యోగులు భరతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి కార్గిల్ యుద్ధంలో అమరులైన వీరజవానులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమం సంఘం జ్ఞానభారతి కార్యదర్శి జోహార్‌ఖాన్, స్వర్ణభారతి చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి ఉన్నారు.


కవిటి: కార్గిల్ వీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న చిన్నారులు